క్లుప్తంగా

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



చిల్పూరు: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యను గురువారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొని ఉన్న సమస్యలను కడియం దృష్టికి తీసుకెళ్లగా త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎంపీపీ సరితబాలరాజు, వైస్ ఎంపీపీ భూక్యా సరితనర్సింహ, ఎంపీటీసీలు పాశం శిరీషసురేష్, ఎన్నకూస కుమార్, తాళ్లపల్లి ఉమసమ్మయ్య తదితరులు ఉన్నారు.

పండ్ల రసాల పంపిణీ



బచ్చన్నపేట: మండల కేంద్రంలో వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యాన చలి వేంద్రం వద్ద గురువారం పండ్ల రసాలను పంపిణీ చేశారు. వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ కూతురు మహతి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పండ్ల రసాలను, స్వీట్లను పంపిణీ చేపట్టారు. వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి, నాయకులు ఆముదాల భూపాల్‌రెడ్డి, నూకల నర్సిరెడ్డి, రమేష్‌రెడ్డి, వడ్డెపల్లి మల్లారెడ్డి, శివరాత్రి రాజనర్సు పాల్గొన్నారు.

జనగామ జిల్లాకు ఐలమ్మ పేరు పెట్టాలి

కొడకండ్ల: చారిత్రాత్మక నేపథ్యం కలిగిన జనగామ జిల్లాకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దూదిగాని నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం తాడితపీడిత సబ్బండ వర్గాలను ఏకం చేసి భూస్వాముల విధానాలకు వ్యతిరేకంగా శ్రామిక వర్గా ల జనం కోసం తన ప్రాణాలను ధారపోసిన వీర వనిత చాకలి ఐలమ్మ అని ఆమె త్యాగాన్ని ప్రభుత్వం గుర్తించి జనగామ జిల్లాను చాకలి ఐలమ్మ జిల్లాగా మార్చాలని కోరారు.

సన్మానం

జఫర్‌గఢ్: ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ యాకూబ్‌రెడ్డి వీడ్కోలు కార్యక్రమానికి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ సూర్యప్రకాశ్ హాజరై యాకూబ్‌రెడ్డిని సన్మానించారు. ఏఎస్సైలు వెంకటనారాయణ, రాజమౌళి, ముసలయ్య, కానిస్టేబుల్లు కృష్ణంరాజు, వీరన్న, గణేష్, అశోక్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



జనగామ: పట్టణంలోని గిర్నిగడ్డకు చెందిన కూలీ ఈ.కళ్యాణ్ (28) అప్పుల బాధతో గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సృజన్ తెలిపారు. రోజువారీగా మట్టి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే కళ్యాణ్.. అప్పులు తీర్చే దారి లేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


చికిత్స పొందుతున్న వ్యక్తి..



కనుకయ్య (ఫైల్)

బచ్చన్నపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని ఆలింపూర్ గ్రామానికి చెందిన పొన్న కనుకయ్య (52)గురువారం మృతి చెందాడు. ఇటీవల బచ్చన్నపేటలో పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బైక్ అదుపు తప్పి పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

తాటిచెట్టు పై పిడుగు



చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామ సమీపంలోని ఎల్లమ్మ ఆలయం ఎర్రగుంట నర్సరీ వద్ద గురువారం తాటిచెట్టుపై పిడుగు పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కల్లుగీసేందుకు గీత కార్మికులు ఆప్రాంతానికి రాగానే వర్షం మొదలు కావడంతో అక్కడే ఉన్న కొట్టంలో కూర్చున్నారు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో పాటు పిడుగు చెట్టుపై పడగానే మంటలు వచ్చాయి.



తరిగొప్పుల: బడిబాట ర్యాలీలో అధికారులు, ఉపాధ్యాయులు



లింగాలఘణపురం: మాట్లాడుతున్న ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి



జనగామ రూరల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న నోడల్ అధికారి రాజేందర్

‘బడిబాట’ను జయప్రదం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి నర్సింహారావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు. ఛాగల్లులో మండల విద్యాశాఖ నోడల్ అధికారి కొమురయ్య ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధన, కల్పిస్తున్న మెరుగైన సౌకర్యాలు తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లలను సర్కారు స్కూళ్లకు పంపించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి, డీటీ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: బడిబాటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న నర్సింహారావు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

తరిగొప్పుల: ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని,ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని మండల నోడల్ ఆఫీసర్ రామచందర్, ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండలకేంద్రంలో ప్రత్యేక ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి గోవిందు రజిత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

లింగాలఘణపురం: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తా వద్ద విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం, ఉదయం పౌష్టికాహారంతో కూడిన టిఫిన్ కూడా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పరశురాములు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మార్తా, జీపీ కార్యదర్శి ప్రవీణ్, టీచర్లు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

జనగామ రూరల్: గ్రామంలో బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల నోడల్ అధికారి వంగాల రాజేందర్ అన్నారు. మండలంలోని గానుగుపహడ్ గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు విజయ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బడిబాట..

జఫర్‌గఢ్: ప్రభుత్వ బడుల్లోనే తమ పిల్లలను చేర్పించాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రా మాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పిల్లలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడిబాటలో అందరూ భాగస్వాములు కావాలి

పాలకుర్తి: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ రాములు అన్నారు. పాలకుర్తి మండలం విస్నూరులో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్ఆర్ దొంతినేని వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ నకీర్త యాకయ్య, ఉప సర్పంచ్ నళిని సోమేశ్వర్‌రావు, ఎంపీటీసీ మాటూరి యాకయ్యలు, అంగన్‌వాడీ టీచర్లు శోభ, రజిత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నకీర్త రేణుక, సభ్యులు రజని, ఉన్నత పాఠశాల చైర్మన్ బేజాది సుమలత సంపత్, ఉపాధ్యాయులు, మాధురి, కవిత, హేమలత పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి

చిల్పూరు: మీ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని.. వారికి చదువు రాకుంటే మమ్ములను నిదీయండంటూ మండల విద్యాశాఖ నోడల్ అధికారి దాసరి గోవర్ధన్ అన్నారు. గ్రామాల్లో బడిబాట కార్యక్రమ ర్యాలీలను హెచ్‌ఎంలు ప్రారంభించారు. పల్లగుట్టలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధి కారి, డీటీ విమల పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో నర్సింహరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దారం శ్రీనివాస్ పాల్గొన్నారు.



పాలకుర్తి: విస్నూరులో..

బడిబాట పట్టాలి..

పాఠశాలల సెలవులు ముగిసినందున ఈతలు కొట్టేందుకు బావులవద్దకు వెళ్ల కుండా చదువుకోడానికి బడిబాట పట్టాలని హెచ్‌ఎం వనజరాణి అన్నారు. గార్లగడ్డతండాలో గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రంగారెడ్డి పిల్లలు బావుల వద్ద ఈతకు వెళ్లగా అక్కడికి వెళ్లి వారికి బడికి వెళ్లాలని అవగాహన కల్పించారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, అందుకు ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల నోడల్ అధికారి డీఎల్ఎన్ మూర్తి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీలను నిర్వహించారు.



జఫర్‌గఢ్: తమ్మడపల్లి (జి)లో..



చిల్పూరు: పల్లగుట్టలో..



బచ్చన్నపేట: బసిరెడ్డిపల్లి...

కులగణన చేసి బీసీల వాటా తేల్చాలి

రఘునాథపల్లి: కులగణన చేసి బీసీల వాటా తేల్చాలని బీసీ రాజ్యాధికార సమితి జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కులగణన చేయక పోవడంతో బీసీలు అన్ని విధాలా నష్టపోతున్నారన్నారు. బీహార్ రాష్ట్రాన్ని మోడల్‌గా తీసుకొని, కులగణన కోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి బిల్లు అమోదించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 43 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పార్టీలకతీతంగా బీసీలంతా ఐక్యతగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

కొడకండ్ల: మండలంలోని ఏడునూతుల గ్రామంలోని రుక్మిణీసత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం విఘ్నేశ్వర, వాస్తు పూజలు, పుణ్యావాచనం, రక్షాబంధనం, శనివారం యాగశాల ప్రవేశం, నిత్య హోమం, దేవతాహ్వానం, ఆదివారం సకలస్నపనము, బలిహరణం, సోమవారం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, బండ్లు తిరుగుట, పారువేట, పుష్పయాగం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నందున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ కోరింది.

మస్టర్లలో సంతకాలు చేయాలి

బచ్చన్నపేట: ఉపాధి హామీ కూలీలు పనులకు వెళ్లినప్పుడు మస్టర్లలో తప్పకుండా సంతకాలు చేయాలని ఈజీఎస్ ఏపీఓ కృష్ణ అన్నారు. మండలంలోని కట్కూర్ గ్రామంలో ఈజీఎస్ కూలీల పని ప్రదేశం వద్దకు వెళ్లి పనులను, మస్టర్‌లను గురువారం పరిశీలించి మాట్లాడారు. జీపీ కార్యదర్శి రూపాచైతన్య, టెక్నికల్, ఫీల్డ్ అసిసెంట్ ఉన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు

తరిగొప్పుల: భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని పలువురు మండల నాయకులు గురువారం కలిశారు. కిరణ్‌కుమార్ రెడ్డి గెలుపొందిన తర్వాత ఆయనను మర్యాపూరకంగా కలిసి శాలువాలతో సన్మానం చేశారు. ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, సంపత్, రమేష్, శ్రావణ్‌రెడ్డి, శివకుమార్ ఉన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

బచ్చన్నపేట: గ్రామాల్లోని వీధుల్లో, ఇళ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండలంలోని ఆలింపూర్ గ్రామ ఎంపీటీసీ మహమ్మద్ మసూద్ అన్నారు. గురువారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. ఉపాధ్యాయులు కోటి, బాలకృష్ణ, రమణి, నర్సమ్మ, మమత, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, అంగన్‌వాడీ టీచర్లు వినోద, రమ, వీఓ అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న పొంనూర్ గ్రామస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పొంనూర్ గ్రామంలో విద్యుత్ సరఫరా సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా పనిచేస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఇనుగాల గణేష్‌రెడ్డి, ఒగ్గు రాజు, పొన్న బీరయ్య, అన్వర్ డిమాండ్ చేశారు. గ్రామంలో నెలకొన్న తీవ్ర విద్యుత్ సరఫరా సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతూ స్థానిక ట్రాన్స్‌కో డీఈ కార్యాలయంలో గ్రామస్తులు, యువత, వివిధ రాజకీయ పార్టీల నాయకులు గురువారం వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో విద్యుత్ సరఫరా అంతరాయం సమస్య గత మూడు నెలలుగా తీవ్రంగా ఉందని, చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్‌లైన్లపై పడుతూ తరచూ సమస్య ఏర్పడుతుందన్నారు. ఈ విషయమై పలుమార్లు విన్నవించినా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదన్నారు. మే 15న గ్రామాన్ని సందర్శించిన విద్యుత్ అధికారులు వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పి ఇంతవరకూ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పొంనూర్ గ్రామంలో విద్యుత్‌సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. గ్రామానికి నూతన జేఎల్‌ఎంను నియమించాలని, నిర్లక్ష్యంగా పనిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని వారు హెచ్చరించారు. గ్రామస్తులు రాకేష్, సునీల్, గణేష్, శివారెడ్డి, విష్ణువర్ధన్, సాయికుమార్, సురేష్‌రెడ్డి, ఈశ్వర్, శ్రీకాంత్, డాక్టర్ గణేష్, రఘు, రోహిత్, సిద్ధు, వినేష్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

తరిగొప్పుల: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా తడి, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. సెగ్రిగేషన్ షెడ్డులో వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేస్తున్న విధానంపై అవగాహన కల్పించారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించడం జరిగింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు భాగ్యలక్ష్మి, అమనగంటి మహేందర్, భూక్య లింగం, కొంకటి రవీందర్, రాజేందర్, మాధవి, నవనీత, రాజు, కుమార్, మమత, రత్న, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



తడి, పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కరాటే ఆత్మరక్షణకు దోహదం



పత్రాలు, బెల్టులు అందుకున్న విద్యార్థులతో రవి

నర్మెట: కరాటే ఆత్మరక్షణకు దోహదపడటంతోపాటు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తుందని షూటోకాన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడ రవి అన్నారు. డీవైఎస్ఓ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో వారంరోజులుగా నిర్వహించిన ఉచిత కరాటే శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి గురువారం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన శిక్షణ పొందిన వారికి ప్రతిభ ఆధారంగా పత్రాలు బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా తల్లిదండ్రులు క్రీడలతో పాటు బాలికలకు కరాటేలో శిక్షణ ఇప్పించాలని సూచించారు. ట్రైనర్ ఎర్రవెల్లి బాబు మాస్టర్, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంతెన మణికుమార్, నెస్కో వ్యవస్థాపకుడే ఐలేని శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు యెలగొండ రవి, బత్తుల నరేందర్ అతిథులు ఆనంద్, వలబోజు రమేష్, శ్రీనివాస్, ముక్కెర రాజు, చౌడవరపు సిద్దులు, 35 మంది శిక్షణ పొందిన బాలబాలికలు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

జనగామ రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మ భిక్షం ప్రభుత్వం డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్క ప్రైవేట్ విద్యా సంస్థలో 25 శాతం ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేపడుతామని అన్నారు. నాయకులు డి.సుమ యాకన్న, సంజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన



దేవరుప్పుల: మండల కేంద్రంలోని భ్రమరాంభ మల్లికార్జునస్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. స్థానికులైన మునగాల ఉమాప్రకాష్,శ్రీనివాస్, నరేందర్, కొత్తలాపురం ప్రేమ్‌ప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో మూడున్నర లక్షల విరాళంతో 41 రోజుల కిందట ధ్వజస్తంభం ఏర్పాటు పునఃప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. ఈ క్రమంలోనే ఆలయ పూజారి పెద్దాపురం వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో నల్లమల్ల అడవుల సమీపంలోని అచ్చంపేటలో నారాయాప కర్రతెప్పించి ఆదిదేవుడు గణపతి, నందిని తదితర నిక్షేపాలతో కూడిన ఇత్తడి పూత తొడుగుతో ప్రత్యేక పూజలతో పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం ముగిసింది.

సోమయ్య మృతి తీరనిలోటు

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎలవర్తి సోమయ్య మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు ఎలవర్తి సోమయ్య ఇటీవల మృతి చెందగా బాధిత సభ్యులను ఆయన పరామర్శించి రూ.5 వేల సాయం అందజేశారు.

లక్ష్మీనారాయణపురంలో భారీ వర్షం



ఇంట్లోకి చేరిన వరద నీరు

పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండలం లక్ష్మీ నారాయణపురం గ్రామంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పలువురి ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ఇబ్బందికి గురయ్యారు. వరద నీరు ఇళ్లలోకి రాకుండ చేయాలని ప్రజలు కోరారు.

కార్మికులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలి

స్టేషన్‌ఘన్‌పూర్: 50 సంవత్సరాల వయస్సు నిండిన కార్మికులందరికీ నెలకు రూ.5వేల పెన్షన్‌ను ప్రభుత్వం అందించాలని భవన నిర్మాణ రంగాల కార్మికుల సంఘం రాష్ట్ర కోశాధికారి తాటికొండ మధు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ రంగాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఎస్ఆర్‌కేఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కామల్ల ఐలయ్య పిలుపు మేరకు ఈనెల 10న నిర్వహించనున్న ఛలో కలెక్టరేట్ బైక్ ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను స్థానిక బీఎస్ఆర్‌కేఎస్ కార్యాలయం వద్ద గురువారం ఆవిష్కరించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల అనిల్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మధు హాజరై మాట్లాడారు.

బీఎస్ఆర్‌కేఎస్ మండల కమిటీ ఎన్నిక

బీఎస్ఆర్‌కేఎస్ ఘన్‌పూర్ మండల నూతన కమిటీని రాష్ట్ర కోశాధికారి తాటికొండ మధు సమక్షంలో గురువారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పండుగ రాజు, ప్రధాన కార్యదర్శి అన్నెపు అనిల్, ఉపాధ్యక్షులు కలకోల ఎల్లయ్య, గుర్రం రమేష్, మారపాక రాజు, కార్యదర్శులుగా తాటికొండ బాలకృష్ణ, గాదె ఆదాం, చెరిపెల్లి రాజు, ప్రచార కార్యదర్శులుగా చింత లింగయ్య, కాగితాల రామకృష్ణ, కోశాధికారి పొన్నగంటి బాబు, కార్యవర్గ సభ్యులుగా బట్టు ఏలియా, గాదరి రమేష్, అన్నెపు సమ్మయ్య, డి.నర్సింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మధు తదితరులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

కొడకండ్ల: చిన్ననాటి మిత్రులు ఒక్క చోటకు చేరి.. బాల్యంలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మండలంలోని ఏడునూతల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1999- 2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు రోజంతా సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న పంచాయతీ సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ సమస్య ఉందని అధికారులు చెబుతుండగా గత ఐదు రోజులుగా గ్రామాల్లో నీరు లేక ప్రజలు అరిగోస పడుతున్నారు. వేసవి కాలం పూర్తయ్యాక వర్షాకాలం ప్రారంభంలో నీటి కష్టాలు ఏమిటని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. ప్రధానంగా స్టేషన్‌ఘన్‌పూర్, పాంనూర్, నమిలిగొండ, శివునిపల్లి, ఛాగల్లు తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది వాటర్ ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తుండగా ప్రజలు బిందెలు, బకెట్లతో ట్యాంకర్ల వద్ద పడరాని పాట్లు పడుతున్నారు. ఏది ఏమైనా వర్షాకాలంలో ప్రజలు నీటి కోసం పడుతున్న అవస్థలు చూస్తుంటే సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది.